



కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: స్థానిక భవానీనగర్‌లోని కనకదుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా మహిళలు శుక్రవారం బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1143 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 505.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఏఎన్‌యూ వీసీగా ఆచార్య గంగాధరరావు బాధ్యతల స్వీకారం



ఏఎన్‌యూ:ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీగా కంచర్ల గంగాధరరావు శుక్రవారం ఉదయంబాధ్యతలు స్వీకరించారు. వీసీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ ఛాన్సలర్‌గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపడతానని తెలిపారు. యూనివర్సిటీని విద్య, బోధన, పరిశోధన రంగాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. వీసీకి పలువురు అభినందనలు తెలిపా రు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరుఎడ్యుకేషన్: భారత సైన్యంలో నియామకాలకు సంబంధించిన అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు కనీస విద్యార్హతగా 10వ తరగతి చదివి ఉండాలని, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు 8వ తరగతి విద్యార్హతతోపాటు 17 నుంచి 21 ఏళ్ల లోపు అవివాహిత యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ, యువకులు 'జాయిన్ ఇండియన్ ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి

గుంటూరుఎడ్యుకేషన్: భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించే విషయమై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డీఈఓ పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పైకప్పు పెచ్చులూడిన తరగతి గదులు, దెబ్బతిన్న వరండాలతోపాటు చెట్ల కింద విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, అవసరమైతే ఆయా తరగతులను ఇతర సెక్షన్లతో కలుసుకుని నిర్వహించాలని, ఈ విషయంలో అశ్రద్ధ వహించరాదని స్పష్టం చేశారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

తాడేపల్లిరూరల్: మంగళగిరిలో వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ముత్యాల పందిరి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ నరసింహస్వామి వార్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

లబ్ధిదారులకు నెలకు రూ.4000

గుంటూరు వెస్ట్:జిల్లా స్థాయి స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. మొత్తం 417 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. ఒక్కొక్క లబ్ధిదారునికి నెలకు రూ.4000 అందజేస్తామన్నారు. అనాథలు, పాక్షిక అనాథలు, హెచ్‌ఐవీ సోకిన 18 ఏళ్లలోపు వారికి ఈ ఆర్థిక చేయూత అందుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి ఎం.ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్ షిప్స్

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల చదువులకు నేషనల్ స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తుందని అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9,10 తరగతి (ప్రీ మెట్రిక్ విద్యార్థులు), ఇంటర్ ఆపై చదువులు (పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు), టాప్‌క్లాస్ అభ్యసించే దివ్యాంగ విద్యార్థులు www.depwd.gov.in, httpr://rchoarrhipr.gov.in డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్‌పవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్ వెబ్‌సైట్స్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



జనాభిమాన జల్లు : వినుకొండ వద్ద జోరువానలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికేందుకు తరలివచ్చిన జనసందోహం



చల్లని స్పర్శ : సంతమాగులూరులో చిన్నారిని ఎత్తుకుని లాలిస్తున్న వైఎస్ జగన్

జోరువానలో.. జన గర్జన

రాక్షసమూకల దాష్టీకాలపై గళమెత్తిన పల్నాడు

- జననేత వైఎస్ జగన్‌కు అడుగడుగునా జేజేలు
- గాయపడిన గుండెలకు ఆత్మీయ నేస్తం ఓదార్పు
- బాధిత కుటుంబాలకు నేనున్నానని భరోసా
- పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపిన ప్రజా హృదయ విజేత



న్యాయం కోసం : వినుకొండలో రషీద్ చిత్రంతో జననేత కోసం నిరీక్షణ

అలజడి రేగిన గుండెలకు చల్లని ఓదార్పై కదిలిన ఆత్మీయ నేస్తానికి అడుగడుగునా పల్నాడు నీరాజనం పలికింది. సర్కారు ఆంక్షలు, బెదిరింపులతోపాటు జోరువాననూ లెక్కచేయక జననేత వెంట తరంగమై నడిచింది. రాక్షస మూకల దాష్టీకాలపై ఉరుమల్లే గర్జించింది. బాధితులకు నేనున్నానని ఎలుగెత్తిన వరాల రేడు వెన్నలాంటి మనసును చూసి మెరుపల్లె మెరిసింది. గుండెలనిండా మనోధైర్యం నింపుకొని దొంగ ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంపై గళమెత్తింది. ఇకపైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని ప్రతిన బూనింది.

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం చేపట్టిన పల్నాడు జిల్లా పర్యటన ఆద్యంతం జయప్రదమైంది. జోరువానలోనూ జననేతకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు ప్రజలు రోడ్ల వెంట బారులుతీరారు. సర్కారు ఆంక్షలకు, అధికారపార్టీ బెదిరింపులకూ వెరవక వైఎస్ జగన్ కోసం గంటల తరబడి రహదారులపై నిరీక్షించారు. ఫలితంగా ప్రధాన రహదారుల కూడళ్లు, పల్లెలు అన్నీ జనసంద్రమయ్యాయి.

అద్భుత ప్రజాదరణ మధ్య పర్యటన

వినుకొండ పట్టణంలో తెలుగుదేశం పార్టీ గూండా జిలాని చేతిలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని ఓదార్చి, ఆ కుటుంబంతోపాటు పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపేందుకు తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు ఏడున్నర గంటల ప్రయాణం అనంతరం సాయంత్రం 5.30 గంటలకు వినుకొండకు చేరారంటే ఆయనపై ప్రజలు ఎంతటి ఆదరాభిమానాలు కురిపించారో అర్థం చేసుకోవచ్చు.



జననేతకు జేజేలు : వైఎస్ జగన్‌కు ఎదురేగి స్వాగతం పలుకుతున్న ప్రజలు

చిలకలూరిపేటలో స్వాగతం

మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి చిలకలూరిపేట చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. నరసరావుపేట రోడ్డు బ్యాంకు కాలనీ వద్ద గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు.

కొండంత భరోసా

ఎట్టకేలకు వినుకొండ పట్టణానికి చేరుకున్న వైఎస్ జగన్ రషీద్ గృహంలోకి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దారుణం ఎలా జరిగిందో తెలుసుకుని ఓదార్చారు. తానున్నానని భరోసా కల్పించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇటువంటి దురాగతాలు మళ్లీ జరగకుండా ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా వచ్చే బుధవారం ఢిల్లీలో ధర్నా నిర్వహించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రికి వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి పేర్నివెంకటరామయ్య(నాని), మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ప్రోగ్రామ్ కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాయలసీమకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తుంగతుర్తి ప్రకాష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

నరసరావుపేటలోనూ అదే అభిమాన జల్లు

నరసరావుపేట మండలంలోని బసికాపురం గ్రామం వద్ద మాజీ ఎమ్మెల్యే, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో రోడ్డుపైకి వచ్చి కాన్వాయ్‌కు ఎదురేగి జననేతకు నీరాజనం పలికారు. కారు నుంచే పార్టీ శ్రేణులకు నమస్కరిస్తూ ముందుకు సాగిన వైఎస్ జగన్ ఎస్ఆర్‌కేటీ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో గుమికూడిన శ్రేణులకు అభివాదం చేశారు. అనంతరం బైపాస్‌రోడ్డు నుంచి వినుకొండకు వెళ్లేందుకు గుంటూరు–కర్నూలు రహదారికి చేరుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరిన ఆయనకు ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం, కాకాని, సంతమాగులూరు అడ్డరోడ్డు, శావల్యాపురం, విఠంరాజుపల్లి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌తో కరచాలనానికి పోటీ పడ్డారు.



ఏటుకూరు వద్ద వేచి చూస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్, కార్యకర్తలు



కాజ టోల్‌గేట్ వద్ద అధినేత రాక కోసం వేచి చూస్తున్న పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ, నాయకులు



పెదకాకాని వై జంక్షన్ వద్దకు చేరుకున్న గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్ నూరి ఫాతిమా, కార్యకర్తలు

ఇసుక స్టాక్ పాయింట్లలో మంత్రి నాదెండ్ల తనిఖీ

- అధికారులపై ఆగ్రహం
- ఆరోపణలు ఎందుకు వస్తున్నాయంటూ ప్రశ్న
- ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదంటూ హెచ్చరిక



ముస్నంగిలో అధికారులతో మంత్రి నాదెండ్ల

తెనాలి: ఇసుక స్టాక్ పాయింట్లలో నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కొల్లిపర మండలంలోని స్టాక్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 16వ తేదీన మున్నంగిలోని స్టాక్ పాయింట్‌లో ఇసుక లోడింగ్‌కు అదనపు వసూళ్లు, గరిష్టంగా 20 టన్నుల లోడింగ్ నిబంధన అతిక్రమణ, సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా లోడింగ్ వంటి ఉల్లంఘనలపై 'సాక్షి' దినపత్రికలో 'ఇసుక ఉచితానికి చెల్లు' వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. విచారించి చర్యలు తీసుకుంటామని ఆరోజు వివరణ ఇచ్చిన అధికారులు, తర్వాత అటువంటివి ఏమీ జరగటం లేదంటూ ఖండించారు. స్టాక్ పాయింట్లలో ప్రదర్శించిన టోల్‌ఫ్రీ నంబరుకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, అందువల్ల అక్కడ ఏమీ జరగలేదని తేల్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మంత్రి మనోహర్ ఆయా స్టాక్ పాయింట్లను తనిఖీ చేయటం ప్రాధాన్యత సంతరించుకుంది.ముందుగా కొల్లిపర స్టాక్‌పాయింట్‌కు వెళ్లిన మంత్రి, అక్కడ లోడింగ్ నిలిపివేయటాన్ని గమనించారు. వర్షం కారణంగా స్టాక్ పాయింట్‌లో నీరు నిలవటంతో లోడింగ్ సాధ్యం కాదని నిలిపినట్టు అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి మున్నంగి స్టాక్‌పాయింట్‌కు వెళ్లిన మంత్రి, అక్కడ లోడింగ్ తీరును, రికార్డులను పరిశీలించారు. ఇసుక లోడింగ్ చేసిన లారీలను చూసి, మళ్లీ కాటా పెట్టించాలని అధికారులను ఆదేశించారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో విడివిడిగా మాట్లాడారు. 'ఇక్కడేం జరుగుతోంది...ఆరోపణలు ఎందుకొస్తున్నాయి...ఇలాగైతే ఊరుకొనేది లేదు' అని తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీని అవకతవకల్లేకుండా చూడాలని స్పష్టంచేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని ఆదేశించారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులతోనూ మాట్లాడారు. టీడీపీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా వ్యవహరించాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

- జిల్లాలో సగటు వర్షపాతం 20.9 మి.మీ
- 1304 హెక్టార్లలో నీటమునిగిన వరి సాగు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లిపర, తెనాలి, తాడేపల్లి, పెదకాకాని, వట్టిచెరుకూరు, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల పరిధిలోని 64 గ్రామాల్లోని 1956 మంది రైతులకు చెందిన వెద పద్ధతిలో సాగు చేసిన 1,304 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేనిచో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటి వరకు వరి పంటకు స్వల్ప నష్టం మాత్రమే జరిగిందని ఇంకా అధిక వర్షాలు కురిస్తే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఎడతెరిపి లేకుండా జల్లులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సగటున 20.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 34.8 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 10.6 మి.మీ వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తుళ్లూరు 28.8, తాడేపల్లి 26.8, కాకుమాను 26.2, పెదనందిపాడు 25.4, మంగళగిరి 25, ఫిరంగిపురం 24.2, చేబ్రోలు 23.4, వట్టిచెరుకూరు 20.8, గుంటూరు పశ్చిమ 20, గుంటూరు తూర్పు 18.2, కొల్లిపర 17.4, తాడికొండ 16.4, మేడికొండూరు 16.2, పెదకాకాని 15.2, ప్రత్తిపాడు 15.2, తెనాలి మండలంలో 12 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై మాసం 19వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 101.1 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 160.2 మి.మీ వర్షపాతం కురిసింది. మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు



తెనాలి: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహణ చట్టవిరుద్ధమని తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పరీక్షలు చేసినట్టయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయలో శుక్రవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధ్యక్షత వహించారు. తెనాలి డివిజన్‌లో మొత్తం 66 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. పీసీ–పీఎన్‌డీటీ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని గుర్తుచేశారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు చట్ట నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టంచేశారు. చట్ట వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించరాదని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో డాక్టర్ డి.శారద, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్‌కుమార్, తెనాలి డీఎస్పీ రమేష్‌బాబు, కమిటీలోని ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణార్థులకు ఉచిత హాస్టల్ వసతి

గుంటూరు ఎడ్యుకేషన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, సివిల్స్ విజేత డాక్టర్ జి.వివేకానంద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు వసతి ఖర్చులకు అదనపు భారం కారాదనే సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న శ్రీకాకతీయ ఎడ్యుకేషనల్ అకాడమీ సహకారంతో 90 మందికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులకు సివిల్స్‌లో ర్యాంకుల సాధనే లక్ష్యంగా ప్రారంభిస్తున్న రెసిడెన్షియల్ క్యాంపస్‌లో మెరిట్ ప్రాతిపదికన యువతీ, యువకులకు చెరో 45 సీట్లు చొప్పున కేటాయిస్తామని తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆశావహులు ఉచిత హాస్టల్ వసతి కోసం తమ పూర్తి వివరాలను 98660 74047 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

వైజ్ఞానిక ప్రతిభ వెలికితీసేలా..

- హైస్కూల్ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ప్రతిభా ఉపకార వేతనాలు
- ఎంపికైన వారికి ఉపకార వేతనంతోపాటు పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 15 వరకు గడువు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంయుక్తంగా ప్రతి యేటా ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యాసంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు వీవీఎం పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

జూనియర్, సీనియర్ విభాగాల్లో

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్, 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లీషుతోపాటు ప్రాంతీయ భాషల్లో నిర్వహించే పరీక్షను విద్యార్థుల ఆసక్తి మేరకు భాషను ఎంపిక చేసుకోవచ్చు.

ఎంపిక ఇలా...

- పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మంది చొప్పున మొత్తం 120 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురేసి చొప్పున మొత్తం 18 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష నవంబర్ 26న లేదా డిసెంబర్ 3,10,17వ తేదీల్లో ఏదో ఒక రోజున రాయాల్సి ఉంటుంది.
- రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని జాతీయస్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024–25 విద్యాసంవత్సరానికి జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనాసంస్థల్లో 1–3 వారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం ఇలా

ఆసక్తి గల విద్యార్థులు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి వివరాలను నమోదు చేసుకుని, పరీక్ష రుసుం రూ.200 చెల్లించాలి. సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు.

అక్టోబర్ 10న మాక్‌టెస్ట్

వీవీఎం మాక్ టెస్ట్ అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 23–27 తేదీల మధ్య జరుగుతుంది. ఆయా తేదీల్లో ఒక తేదీని ఎంపిక చేసుకుని పరీక్ష రాసేందుకు వీలుంది.

ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించి, శాస్త్ర, సాంకేతికరంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన వీవీఎం పరీక్షకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల నుంచి విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేయించాలి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్ష రాసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలి. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తగు శ్రద్ధ చూపాలి.

– పి.శైలజ, డీఈవో, గుంటూరు

మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు



ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న మంత్రి మనోహర్ అక్కడ పరిస్థితులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వారినే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్యాధికారులతో మాట్లాడి రోగులకు ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరచాలని సూచించారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఓపీ దగ్గర జనం ఎక్కువ మంది ఉండటంపై వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడి నుంచి చెంచుపేటలోని రైతుబజార్‌ను మంత్రి మనోహర్ సందర్శించారు. ధరల పట్టికను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీకి వెళ్లి అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ, మురుగుకాల్వల్లో పూడికల తదితర వాటిని పరిశీలించారు. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణం ఉండటం గమనించి అధికారులకు తగు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో కలిసి రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య పరంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పర్యటనలో మంత్రి వెంట వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శైలజ హత్య కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి

దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక



శైలజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కొద్ది రోజుల కిందట దళిత విద్యార్థిని పేరుపోగు శైలజను హత్య చేసిన సంఘటనలోని నిందితుడు నాగరాజుని వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని శైలజ సోదరుడు, కుటుంబసభ్యులను, ఏటుకూరులో ఉన్న శైలజ కుటుంబ సభ్యులను ప్రతినిధి వర్గం శుక్రవారం కలిసి పరామర్శించింది. శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులను కలిసి కేసు పురోగతి గురించి తెలుసుకున్నారు. తెనాలి డీఎస్పీ రమేష్‌తో మాట్లాడగా నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఇప్పటికే ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక వక్తలు మాట్లాడుతూ నాగరాజుని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని, శాశ్వత గృహం ఏర్పాటు చేయాలని, ఒకరికి ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ శిఖ సురేష్, భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, బహుజన పొలిటికల్ సెంటర్ కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బహుజన డెమోక్రటిక్ పార్టీ వ్యవస్థాపకులు డెన్నిస్ రాయ్, నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహారావు, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, రజకజన సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.శ్రీనివాసరావు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు బత్తుల అనిల్ పాల్గొన్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్



పట్నంబజారు: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ చేసుకునే సదవకాశం కల్పించడంతోపాటు పలు పుణ్యక్షేత్రాల దర్శనాలు చేయించే ప్రత్యేక ప్యాకేజీతో బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈనెల 21న పౌర్ణమి పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ ఉన్న నేపథ్యంలో 19వ తేదీ రాత్రి బస్సులు బయల్దేరనున్నాయని, దానిలో భాగంగా 20వ తేదీ తొలుత శ్రీకాళహస్తిలోని సర్వేశ్వరుని దర్శనం, అనంతరం కాణిపాకంలో వరసిద్ధివినాయకుని దర్శనం, అనంతరం శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న అనంతరం అదేరోజు రాత్రి అరుణాచలం చేరుకుంటారన్నారు. 21వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం కోసం సాయంత్రం వరకు సమయాన్ని కేటాయించారు. అనంతరం తిరిగి అదేరోజు రాత్రి బయల్దేరి 22 ఉదయం గుంటూరు రీజియన్‌కు చేరుకుంటారని తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణలకు సంబంధించి 2+2 పుష్‌బ్యాక్ బస్సులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశామని, ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశంతోపాటు, బస్టాండ్‌లోని కౌంటర్‌లలో కూడా టికెట్టు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణానికి సంబంధించి ఒక్కో ప్రయాణికుడికి రూ.2,420 చొప్పున టికెట్టు ధర నిర్ణయించామని, దీంతోపాటుగా అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉంటే బస్సులను కూడా అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 7382897459, 7382896403, 7382894409 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఉంటే రీజియన్ పరిధిలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి, గుంటూరు–1,2 డిపోల నుంచి అవసరమైతే మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

వీవీఐటిలో గూగుల్ క్లౌడ్ జెన్ ఏఐ ప్రోగ్రామ్



గూగుల్ క్లౌడ్ జెన్ ఏఐ ప్రోగ్రామ్‌లో ప్రతినిధులు, కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: దేశంలో తొలిసారిగా వీవీఐటీ కళాశాలలో ఏర్పాటుచేసిన గూగుల్ ల్యాబ్ నందు 'గూగుల్ క్లౌడ్ జెన్ ఏఐ ప్రోగ్రామ్'ను గూగుల్ సంస్థ ప్రతినిధులు గూగుల్ క్లౌడ్ ప్రోగ్రామ్ హెడ్ శ్వేతా కొమ్మినేని, గూగుల్ టెక్నికల్ హెడ్ ఆకాష్ సిన్హాలు శుక్రవారం ప్రారంభించారు. జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత నందు విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మక గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన గూగుల్ క్లౌడ్ జెన్ ఏఐ ప్రోగ్రామ్‌ను ఎల్–4జీ సంస్థ ద్వారా వీవీఐటి విద్యార్థులకు అందించనున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. గూగుల్ క్లౌడ్ ప్రోగ్రామ్ హెడ్ శ్వేతా కొమ్మినేని మాట్లడుతూ జెన్ ఏఐ సాంకేతికతలో నిష్ణాతులుగా తీర్చిదిద్దే సాంకేతికతను గూగుల్ సంస్థ విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో మానవ ప్రయత్నాన్ని జెన్ ఏఐ ఏవిధంగా తగ్గించగలదో విద్యార్థులకు వివరించారు. వివిధ కళాశాలలకు చెందిన 30మంది ఆధ్యాపకులకు జెన్ ఏఐ ప్రోగ్రామ్ గురించి వివరించారు. ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, గూగుల్ ప్రతినిధులు, ఎల్ 4జీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్ రాజు, వెనుక వరుసలో నిందితులు(ముసుగులో ఉన్నవారు)

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరంలో గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరిచారు. విలేకరుల సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ సూచనల మేరకు తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయించే వారిపై నిఘా ఏర్పాటు చేశారు. సీతానగరం రైల్వే ట్రాక్ పక్కన గంజాయి అమ్ముతున్నారని తెలియడంతో ఎస్ఐ ప్రతాప్, కానిస్టేబుళ్లు సురేష్, కొండలు, నాగాంజనేయులు, కల్యాణ్‌లతో కలసి రైల్వే ట్రాక్ వెంబడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రైల్వే ట్రాక్ పక్కన ముగ్గురు యువకులు ఒక బ్యాగ్‌తో కనిపించారు. పోలీసుల రాకను గమనించిన వారు పరారయ్యారు. ఎస్ఐ ప్రతాప్ చాకచక్యంగా వ్యవహరించి పారిపోతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరి వద్ద బ్యాగ్ ఉండగా, ఆ బ్యాగ్‌ను పరిశీలించారు. అందులో చిన్న చిన్న గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. బ్యాగ్‌తో పరారవుతున్న వ్యక్తి బండిరెడ్డి నందు (పెద్దబారు)గా అతనితోపాటు అతని సోదరుడు బండిరెడ్డి అఖిల్ (చిన్నబారు), అవధూత భార్గవ్ (బబ్లూ)గా గుర్తించారు. వీరు మద్యానికి, గంజాయికి అలవాటుపడి ఏజన్సీ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి డబ్బుల కోసం వాటిని చిన్నచిన్న పొట్లాలుగా ఏర్పాటు చేసి తాడేపల్లి సీతానగరం రైల్వేట్రాక్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు. ఈ గంజాయిని ఏజన్సీ ఏరియాలోని శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద కేజీ 3 వేల చొప్పున రెండు కేజీలు కొనుగోలు చేశారని, వీరి వద్ద 1.6 కేజీల గంజాయి చిన్నచిన్న పొట్లాల రూపంలో లభించిందని, ఒక్కొక్క ప్యాకెట్ 11 గ్రాములు ఉంటుందని, ఈ కేసులో పట్టుబడిన వారిలో అవధూత భార్గవ్ (బబ్లూ) గతంలో నర్సీపట్నం, మోతిగూడెం ఏరియాలో అతనిపై గంజాయి కేసు నమోదైనట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి తాగుతున్నా, విక్రయిస్తున్నా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఉప్పలపాడులోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేశామన్నారు. 2011–12 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన జట్టును ఈనెల 23 నుంచి 25 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. పోటీలకు వచ్చేటప్పుడు ఆధార్‌తోపాటు జనన ధ్రువీకరణ పత్రం, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తమతో తీసుకురావాలని సూచించారు.

ప్రకృతి మాతా ప్రణామం

- ఇంద్రకీలాద్రిపై ప్రారంభమైన శాకంబరీదేవి ఉత్సవాలు
- శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ
- 35 టన్నుల కూరగాయలతో ఆలయ అలంకరణ
- వర్షాన్ని సైతం లెక్క చేయక పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

శతాక్షీదేవికి ప్రణమిల్లిన భక్తజనం

భక్త జనులపై చల్లటి చూపులు ప్రసరిస్తూ.. ముల్లోకాలను కాపాడే దుర్గమ్మ శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సమస్త భక్తజనులకు శాకాలతో ఆకలిని తీర్చే శతాక్షీదేవిని భక్తులు ప్రత్యేక పూజలతో మనసారా కొలిచారు. రోజంతా వర్షం కురుస్తూనే ఉన్నా ప్రకృతి మాత దివ్య దర్శనం కోసం పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో పచ్చందాలను సంతరించుకున్న ఇంద్రకీలాద్రిని చూసి మురిసిపోయారు.



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఉత్సవాలలో తొలి రోజు శుక్రవారం కావడంతో సాధారణ భక్తులతో పాటు ప్రముఖులు సైతం అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, ఆయా దేవాలయాల్లో దేవతా మూర్తులను ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులు సైతం పూజా సామగ్రి, కొబ్బరి కాయ బదులుగా ఆకుకూరలు, కాయగూరలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆలయానికి సుమారు 35 టన్నుల కూరగాయలతో అలంకరించినట్లు ఆలయ ఈవో కేఎస్ రామరావు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు..

ఉత్సవాలను పురస్కరించుకుని విఘ్నేశ్వర పూజ, రుత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ జరిగాయి. సాయంత్రం కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన వంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. తెల్లవారు జామున అమ్మవారికి ఖడ్గమాలార్చన, నిత్య పూజల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శించుకున్నారు. శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఇంట అన్నపానీయాలకు కొదవ లేకుండా ఉంటుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఉత్సవాలలో తొలి రోజున అమ్మవారికి వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని కాయగూరలతో అలంకరించారు.

కదంబ ప్రసాదం కోసం బారులు

అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో దేవస్థానం కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ఉచిత ప్రసాదాల వితరణను ఆలయ ఈవో కేఎస్ రామరావు లాంఛనంగా ప్రారంభించారు. కదంబ ప్రసాదం కోసం బారులు తీరి కనిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ప్రసాద వితరణలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

ఆకట్టుకున్న నవదుర్గలు..

శాకంబరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన నవదుర్గలు, సింహ వాహనంపై కొలువుదీరిన దుర్గమ్మతో పాటు వంకాయలతో తీర్చిదిద్దిన శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సింహవాహన దుర్గ, శివలింగం వద్ద ఏర్పాటు చేసిన కరివేపాకు తోట భక్తులకు మరింతగా ఆకట్టుకుంది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాన్ని సైతం భక్తులు లెక్క చేయకుండా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. శాకంబరీ దేవి ఉత్సవాలను పురస్కరించుకుని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు.

35వేల కిలోల కూరగాయలు విరాళం..

ఏలూరుకు చెందిన సురేష్ వెయ్యి కిలోల కూరగాయలు, తాడేపల్లిగూడెంకు చెందిన పెద్దిరాజు 3 వేల కిలోలు, తణుకుకు చెందిన కొత్తపల్లి రామచంద్రరావు 2 వేల కిలోలు, సిద్ధాంతంకు చెందిన ఆర్ఎస్ సాయి 1500 కిలోలు, మడికి చెందిన దుర్గాప్రసాద్ 1500 కిలోలు, కొత్తపేటకు చెందిన రెడ్డియ్య 2 వేల కిలోలు, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కాశీ 3 వేల కిలోలు, చిన్న ఓగిరాలకు చెందిన దోనేపూడి శివాజీ, మరీదు శివశంకర్ 1500 కిలోలు, పెద్ద ఓగిరాల అన్నం సుబ్బారావు, శివారెడ్డి వెయ్యికిలోలు, ఉయ్యూరు సుధీర్ టింబర్ డిపో 5 వందల కిలోలు, యడ్లపల్లికి చెందిన కేశినేని వెంకటేశ్వరరావు, అలపాటి గంగాధరరావు 3వేల కిలోలు, సంగం జాగర్లమూడికి చెందిన శ్రీనివాస్ వెయ్యి కేజీలు, విజయవాడ గాంధీజీ మార్కెట్‌కు చెందిన ముత్యాలరావు 2 వేల కిలోలు, ఆర్ఎస్ఆర్, రాజేష్ రెండు వేల కిలోలు, గుంటూరు కూరగాయల మార్కెట్‌కు చెందిన బ్రహ్మనాయుడు రెండు వేల కిలోలు, శివయ్య, బాబులు రెండు వేల కిలోల ఆకుకూరలు, గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఆంజనేయులు 5 వందల కిలోలు, గుంటూరు సాంబిరెడ్డి వెయ్యి కిలోల సొరకాయలు, ఎస్. నరేంద్రకుమార్ కూరగాయలు, నారాకోడూరు, చేబ్రోలు, తెనాలికి చెందిన బి. శ్రీనివాస్‌రావు, రంగయ్య, ఫణీంద్రబాబు 3 వేల కిలోలు, విజయవాడకు చెందిన చదలవాడ కృష్ణదాస్, భక్త వత్సల సేవా సమితి, సోమయాజులు, చంద్రమౌళేశ్వరరావు, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, లలిత కూరగాయాలను అందించారు. మొత్తం 35 వేల కిలోల కూరగాయాలను ఆలయ అలంకరణ నిమిత్తం ఉపయోగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

